నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, బుధవారం 17 జనవరి 2024 | SURYAPET

## రైళ్లపై రాళ్లు రువ్వితే కఠిన చర్యలు

- ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ పీబీ ఇంగిల్

నీలగిరి, జనవరి 16 : నల్లగొండ మీదుగా వెళ్తున్న రైళ్లపై రాళ్ల దాడి చేస్తే సహించేది లేదని, కఠిన చర్యలు ఉంటాయని ఆర్‌పీఎఫ్ (రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్) ఇన్‌స్పెక్టర్ పీబీ ఇంగిల్ హెచ్చరించారు. ఇటీవల వందేభారత్‌తోపాటు మరికొన్ని రైళ్లపై రాళ్లు విసిరిన ఎనిమిది మంది విద్యార్థులను పట్టుకుని వారి తల్లిదండ్రుల సమక్షంలో మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నడుస్తున్న రైళ్లపై విద్యార్థులు రాళ్లు విసురుతుండడంతో ప్రయాణికులు తీవ్ర గాయాల పాలవుతున్నారని, కొన్నిసార్లు ప్రాణాల మీదికి వస్తున్నదని అన్నారు. అంతేగాకుండా పెద్ద ఎత్తున ప్రమాదం జరిగే అవకాశాలు కూడా ఉన్నాయని తెలిపారు. ఇలాంటి సంఘటనలను సహించేది లేదని, రాళ్లు రువ్విన వారు విద్యార్థులు కావడంతో వారి భవిష్యత్ దృష్ట్యా తల్లిదండ్రులకు వివరించినట్లు తెలిపారు. రైల్వే కేసులు నమోదైతే జీవితంలో ప్రభుత్వ ఉద్యోగానికి పనికిరాకుండా పోతారని అన్నారు. కేసులు నమోదైతే పర్యవసనాలు చాలా తీవ్రంగా ఉంటాయని, ఇలాంటి వాటిని మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైల్వే ఏఎస్ఐ సి.వెంకన్న, బాలూనాయక్, సుశీల్‌కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రైతన్న చూపు.. కొత్త పంటల వైపు

## పండ్లు, కూరగాయలు సాగు చేస్తున్న అన్నదాతలు

### సూర్యాపేట జిల్లాలో 39,260 ఎకరాల్లో కూరగాయలు, ఉద్యాన తోటలు

సూర్యాపేట, జనవరి 16 (నమస్తే తెలంగాణ) : రైతులు సంప్రదాయ పంటలు కాకుండా లాభాలు వచ్చే ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు అడుగులు వేస్తున్నారు. రొటీన్‌గా పండించే వరి, వేరుశనగ వంటి పంటలే కాకుండా కొత్తగా ఆలోచన చేస్తూ పండ్లు, కూరగాయలు, ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారిస్తున్నారు. నిత్యం డిమాండ్ ఉండే కూరగాయలకు తోడు సీజనల్ వారీగా వచ్చే ఆయా రకాల పండ్లు, మంచి డిమాండ్ ఉండే ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారు. సూర్యాపేట జిల్లాలో ప్రస్తుతం 19,405 మంది రైతులు 39,260 ఎకరాల్లో పండ్లు, కూరగాయలు, ఆయిల్ పామ్, మిర్చి పంటలు వేశారు. 5,457 మంది రైతులు 15,961 ఎకరాల్లో వివిధ రకాల పండ్ల తోటలు సాగు చేయగా.. 606 మంది రైతులు 750 ఎకరాల్లో కూరగాయలు వేశారు. 754 మంది 3,250 ఎకరాల్లో ఆయిల్ పామ్, 12,286 మంది రైతులు 19,280 మిర్చి సాగు చేస్తున్నారు.



మిర్చి తోటను పరిశీలిస్తున్న అధికారి(ఫైల్)

**ఉమ్మడి రాష్ట్రంలో కరువుతో అల్లాడిన రైతాంగం**

కేసీఆర్ ప్రభుత్వంలో 24 గంటల విద్యుత్, కాళేశ్వరం జలాలు రావడం, మూసీ ఆధునీకరణతో వ్యవసాయం పండుగలా మారి సంతోషంగా ఉన్నారు. దాంతో సంప్రదాయ పంటలపై ఆధారపడ్డ అన్నదాతలు కొత్త పంటల సాగు వైపు మళ్లుతున్నారు. కేసీఆర్ సర్కారు సూచనలతో జిల్లాలో చాలా మంది రైతులు ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారు. మరికొంత మంది పండ్ల తోటలు, కూరగాయలు పండిస్తూ అధిక లాభాలు ఆర్జిస్తున్నారు. అటువంటి రైతులను ఉద్యానవన శాఖ సబ్సిడీ రుణాలు, సాంకేతిక పరికరాలు అందిస్తూ ప్రోత్సహిస్తున్నది. దాంతో జిల్లాలో పదేండ్ల క్రితం 2500 ఎకరాలకు మించని పండ్లు, కూరగాయలు, మిర్చి, ఆయిల్ పామ్ పంటల సాగు ఇప్పుడు 39,260 ఎకరాలకు చేరడం గమనార్హం.



మునగాల మండలం మాధవరంలో ఖర్జూర తోట పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి శ్రీధర్ (ఫైల్)

**రైతన్నల్లో గణనీయమైన మార్పు**

దశాబ్దాలుగా కరువుతో అల్లాడిన జిల్లా రైతులు సగం వరకు భూములను పడావు పెట్టారు. కేసీఆర్ పుణ్యమా అని కాళేశ్వరం జలాలతోపాటు 24 గంటల విద్యుత్ రావడంతో కొద్ది సంవత్సరాలుగా సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. అయితే.. రొటీన్‌గా కాకుండా లాభదాయక పంటల సాగుకు రైతాంగం ఉత్సాహం చూపిస్తున్నది. ఈ క్రమంలో జిల్లాలో 400 మంది రైతులు ఆయిల్ పామ్ పంట వేశారు. 1,198 మంది రైతులు 2,871 ఎకరాల్లో వివిధ రకాల పండ్ల తోటలు సాగు చేస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం 3,624 మంది రైతులు 11,948 ఎకరాల్లో మామిడి, 1,425 మంది 3,092 ఎకరాల్లో నిమ్మ, 35 మంది 212 ఎకరాల్లో జామ, 14 మంది రైతులు 26 ఎకరాల్లో అరటి సాగు చేస్తున్నారు. 26 మంది రైతులు 64 ఎకరాల్లో సీతాఫలం, 754 మంది 3,250 ఎకరాల్లో ఆయిల్ పామ్, 16 మంది రైతులు 27 ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్, 18 మంది రైతులు 36 ఎకరాల్లో బొప్పాయి, 100 మంది రైతులు 227 ఎకరాల్లో సపోట, 99 మంది 274 ఎకరాల్లో స్వీట్ కార్న్ సాగు చేస్తున్నారు. వీటికితోడు 606 మంది రైతులు 750 ఎకరాల్లో కూరగాయలు, 12,286 మంది రైతులు 19,280 ఎకరాల్లో మిర్చి పంట వేశారు. మొత్తంగా జిల్లాలో 19,405 మంది రైతులు 39,260 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు.

**కాళేశ్వరం నీళ్లొచ్చినంకనే వేస్తున్నం**

మాకు రెండెకరాల వ్యవసాయ భూమి ఉన్నది. గతంలో నీళ్ల సౌలత్ లేక అరకొరగా వరి, కంది, వేరుశనగ పంటలు పండించేటోళ్లం. కాళేశ్వరం నీళ్లతోటి ఆరేడేండ్ల సంది కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నం. మేము పండించిన కూరగాయలను నేరుగా అమ్ముకుంటున్నాం. మొదట్లో దళారులను నమ్మి మోసపోయినం. ఇప్పుడు నేరుగా సూర్యాపేట కూరగాయల మార్కెట్లో అమ్ముతుండడంతో మంచి లాభాలు వస్తున్నాయి. అధికారులు కూడా అప్పుడప్పుడు వచ్చి మా పంటలు చూసి సలహాలు ఇస్తున్నారు. మిగతా పంటల కంటే కూరగాయల పంటలే లాభదాయకంగా ఉన్నాయి.

– ధరావత్ బుజ్జి, పిల్లలజెగ్గుతండా, చివ్వెంల మండలం



**వరి కంటే కూరగాయలతోనే లాభాలు**

నాకు నాలుగు ఎకరాల పొలం ఉన్నది. కొన్నేండ్లుగా వరి సాగు చేశాను. అందులో ఆశించిన లాభం రాలేదు. దీంతో రెండు ఎకరాల్లో వరి పొలం, రెండు ఎకరాల్లో కూరగాయల సాగు చేశాను. కూరగాయల సాగుతో అధిక లాభాలు వస్తున్నాయి. మార్కెట్‌లో ఇప్పుడు కూరగాయలకు మంచి ధరలు పలుకుతున్నాయి. అమ్మకాలు చేయడంతోపాటు ఇంటి అవసరాలకు ఉపయోగపడుతున్నాయి. కూరగాయల సాగుతో మంచి అదాయం వచ్చింది.

– బానోతు నాగులు, రైతు, కోటినాయక్ తండా, ఆత్మకూర్(ఎస్) మండలం



## డిండి ఎత్తిపోతల పనులు వేగవంతం చేయాలి

- నల్లగొండ జిల్లా కలెక్టర్ హరిచందన
- జిల్లాలో లిఫ్టులు, ఇరిగేషన్ పనులపై సుదీర్ఘ సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

నల్లగొండ, జనవరి 16 : డిండి ఎత్తిపోతల పథకం కింద చేపట్టిన రిజర్వాయర్ల భూ సేకరణ, పునరావాస కేంద్రాల పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ దాసరి హరిచందన అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌తో కలిసి రెవెన్యూ, భూ సేకరణ, ఇరిగేషన్ శాఖల అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. డిండి ఎత్తిపోతల కింద చేపట్టిన సింగరాజుపల్లి, చింతపల్లి, డిండి మెయిన్ కెనాల్, కిష్టరాయినిపల్లి, శివన్నగూడెం, గొట్టిముక్కల రిజర్వాయర్ల భూ సేకరణ, పునరావాస కేంద్రాల ఏర్పాటు పనుల ప్రగతిపై సమీక్షించారు. ఏఎంఆర్‌పీలో భాగంగా చేపట్టిన పెండ్లిపాకల, ఉదయ సముద్రం, డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ భూ సేకరణ, పునరావాస పనులతోపాటు, అంబాభవాని, అయిటిపాముల, కాళేశ్వరం, పొగిళ్ల లిఫ్ట్ పనుల ప్రగతిపై సుదీర్ఘంగా సమీక్షించారు. డిండి ఎత్తిపోతలకు సంబంధించి నిర్వాసితుల పునరావాస కల్పనకు పీడీ నోటిఫికేషన్ జారీ చేయాలని దేవరకొండ ఆర్డీఓను ఆదేశించారు. ఉదయ సముద్రం కెనాల్‌పై మార్కింగ్ పనులు వేగవంతం చేయాలని సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీకి సూచించారు. సమావేశంలో ఆర్డీఓలు రవి, దామోదర్ రావు, శ్రీరాములు, ఇరిగేషన్ ఈఈలు యాదన్ కుమార్, రాములు, యలమందయ్య, శ్రీధర్‌రావు, ఈఈలు బుచ్చయ్య, లీల, సూపరింటెండెంట్‌లు హేమలత, రాజశేఖర్ పాల్గొన్నారు.

## ఉన్నతాధికారిపై ఇంటెలిజెన్స్ నిఘా?

- అక్రమాలు, ఆస్తుల చిట్టాపై ఆరా

సూర్యాపేట, జనవరి 16 (నమస్తే తెలంగాణ) : సూర్యాపేట జిల్లాలో సుదీర్ఘ కాలంగా పని చేస్తున్న ఓ ఉన్నతాధికారిపై స్టేట్ ఇంటెలిజెన్స్ బృందం నిఘా పెట్టినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఇటీవల కొద్ది రోజులుగా ఆయన ఆస్తులు, అక్రమాలపై ఆరా తీసినట్లు సమాచారం. సాధారణంగా ఆ అధికారి కుటుంబానికి అనాదిగా పెద్ద మొత్తంలోనే వ్యవసాయ భూమి ఉండగా ప్రస్తుతం ఆ భూమికి నాలుగింతలు పెరిగినట్లు ఇంటెలిజెన్స్ విచారణలో తేలినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. సూర్యాపేట జిల్లాలో మూడు చోట్ల 50ఎకరాలకుపైగా వ్యవసాయ క్షేత్రాలు ఉండగా మహబూబాబాద్ జిల్లాలో సైతం అదే స్థాయిలో ఉన్నాయట. వీటితోపాటు రాష్ట్ర వ్యాప్తంగా చాలా చోట్ల ప్లాట్లు, ఇండ్లు తనతో పాటు తన కుటుంబ సభ్యుల పేరిట ఉన్నాయని, ప్రధానంగా ఓ చోట వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి పక్కనే ఉన్న సుమారు తొమ్మిదెకరాల అసైన్డ్ భూమిని కలుపుకొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సొంత శాఖతోపాటు ఇతర శాఖల్లో పని చేసే వారే ఫిర్యాదు చేయడంతో వచ్చిన ఆదేశాల మేరకు ఇంటెలిజెన్స్ విచారణ చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. అక్రమ సంపాదనతో ఆస్తులు కూడబెట్టడమే కాకుండా ఏజెన్సీల వద్ద ఉండాల్సిన ట్రాక్టర్లు, డిపార్ట్‌మెంట్‌లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ బేసిస్‌లో పనిచేసే ఉద్యోగులను కూడా తన వ్యవసాయ క్షేత్రంలో పనిచేయించుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఓ ఉన్నతాధికారిపై స్టేట్ ఇంటెలిజెన్స్ ఎందుకు విచారణ చేసింది? రిపోర్టు ఎవరికి ఇస్తుంది? అసలు విచారణకు ఎవరు ఆదేశించారు? విచారణలో ఏమి గుర్తించారు? అనే దానిపై జిల్లాలో చర్చనీయాంశమైంది.

## ఎస్సారెస్పీ జలాలకు పూజలు

మోతె, జనవరి 16 : మండలానికి చేరిన ఎస్సారెస్పీ నీటికి రాఘవాపురం స్టేజీ వద్ద మంగళవారం గ్రామ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్సారెస్పీ నీటితో మండలం సస్యశ్యామలం అవుతుందన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొర్ర మధు, నాయకులు ముదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, నందిగామ కృష్ణారెడ్డి, యాట సైదులు, రంగయ్య, ఉప్పయ్య, రామిరెడ్డి, స్వామి, చంద్రునాయక్, లచ్చిరామ్‌నాయక్ పాల్గొన్నారు.



రాఘవాపురం స్టేజీ వద్ద ఎస్సారెస్పీ నీటికి పూజలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, నాయకులు

## చారిత్రక ప్రాంతం ఫణిగిరి

**పర్యాటకంగా మార్చేందుకు ప్రభుత్వం కృషి | పురావస్తు శాఖ డైరెక్టర్ భారతి హోలికేరి**

నాగారం, జనవరి 16 : ఫణిగిరి బౌద్ధ క్షేత్రం 2వేల సంవత్సరాల చరిత్ర కలిగినదని, దానిని పర్యాటక ప్రాంతంగా మార్చేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని రాష్ట్ర ఆర్కియాలజీ పురావస్తు వారసత్వ శాఖ డైరెక్టర్ భారతి హోలికేరి అన్నారు. ఫణిగిరి బౌద్ధ క్షేత్రాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. బౌద్ధ క్షేత్రంపై చారిత్రక ఆధారాలు ఇంకా ఉన్నాయని, మరోసారి తవ్వకాలు జరిపేందుకు ఢిల్లీలోని ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా(ఏఎస్ఐ)కు ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు. ఫణిగిరి తాత్కాలిక మ్యూజియంలో భద్రపర్చిన బౌద్ధ శిల్ప సంపదను ఇటీవల నూతనంగా నిర్మించిన మ్యూజియం భవనంలోకి తరలించి భద్రపరుస్తామని చెప్పారు. అనంతరం ఫణిగిరి గుట్టపై బౌద్ధ సంపద, బౌద్ధ చరిత్ర స్థూప చైత్యాలు, శిల్పాలు, మహా స్థూపాలు, విహార గదులు, శిలా స్థావరాలు, బుద్ధుడి జాతక కథలను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని తాత్కాలిక మ్యూజియంలో భద్రపర్చిన బౌద్ధ సంపదను పరిశీలించారు. బౌద్ధ సంపద రక్షణ కోసం భద్రతను ఏర్పాటు చేయాలని, మౌలిక వసతులు కల్పించాలని గ్రామస్తులు ఆమెను కోరారు. ఆమె వెంట పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు మల్లు నాయక్, సాగర్ యాదవ్, డిప్యూటీ డైరెక్టర్లు రాములునాయక్, నాగరాజు, పద్మనాభం, బోధి సత్వ ఫౌండేషన్ అధ్యక్షులు పులిగిళ్ల వీరమల్లు యాదవ్, సర్పంచ్ గట్టు నర్సింహారావు, జంపాల రాజేశ్, సిబ్బంది వీరయ్య, యాకయ్య, కార్తీక్ ఉన్నారు.



ఫణిగిరి బౌద్ధ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న భారతి హోలికేరి

# బడి బయటి పిల్లలు 1,214 మంది

- ఉమ్మడి జిల్లాలో గుర్తించిన విద్యాశాఖ
- నెల రోజులు సర్వే చేసి వివరాలు వెల్లడి
- ప్రబంధ్ పోర్టల్‌లో వివరాలు నమోదు
- బడిలో చేర్పించేలా చర్యలు చేపట్టిన అధికారులు

రామగిరి, జనవరి 16 : బడి ఈడు పిల్లలంతా బడిలో ఉండాలనే సంకల్పంతో విద్యాశాఖ నిర్వహించిన బడి బయటి పిల్లల గుర్తింపు సర్వే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పటిష్టంగా సాగింది. విద్యాశాఖ -సమగ్ర శిక్ష పరిధిలోని సీఆర్‌పీలు గతేడాది డిసెంబర్ 11నుంచి జనవరి 10 వరకు క్లస్టర్, మండలాల వారీగా సర్వే చేసి జిల్లా అధికారులకు అందజేశారు. దాంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,214 మంది బడి బయటి పిల్లలున్నారనేది స్పష్టమైంది. వీరి సమాచారం అంతా ప్రబంధ్ పోర్టల్‌లో నమోదు చేశారు. సూర్యాపేట జిల్లాలో వీరి సంఖ్య తక్కువగా ఉన్నది.

**అందరూ చదువాలనే లక్ష్యంతో..**

'అందరూ చదువాలి.. అందరూ ఎదుగాలి' అనే నినాదంతో విద్యాశాఖ చర్యలు తీసుకుంటున్నది. ఇందుకోసం పాఠశాలల బలోపేతానికి ప్రాధాన్యం ఇస్తూనే ఏటా చదువుకు దూరంగా ఉంటున్న విద్యార్థులను బడిలో చేర్పించే కార్యక్రమం చేపడుతున్నది. 6 నుంచి 14, 15 నుంచి 19 సంవ్సరాల్లోపు పిల్లలను బడిలో చేర్పించి ఉచిత నిర్బంధ విద్య అందిస్తున్నది. బడిబయట పిల్లలను గుర్తించి సమీప పాఠశాలల్లో చదువు చెప్పిస్తున్నది. 2024-25 సంవత్సరానికి జిల్లాలోని సీఆర్పీలు విద్యాశాఖ సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారి ఆర్.రామచంద్రయ్య పర్యవేక్షణలో బటి బయట పిల్లల గుర్తింపు సర్వే చేపట్టారు. గత నెల డిసెంబర్ 11నుంచి జనవరి 10 వరకు క్లస్టర్ స్థాయిలో జరిపి సర్వే చేసి ఎంఆర్‌సీలకు అందచేశారు. వాటిని ప్రబంధ్ పోర్టల్‌లో సీఆర్పీలు నమోదు చేసి, వాటి పత్రాలను మండల వనరుల కేంద్రాలు, అక్కడి నుంచి డీఈఓ కార్యాలయంలోని సమగ్ర శిక్షకు చేరవేశారు. ఆయా ప్రాంతాల్లో నమోదు చేసిన పిల్లలను తిరిగి బడిలో చేర్పించేలా సీఆర్‌పీలు, జిల్లా విద్యాశాఖాధికారులు నిమగ్నమయ్యారు. మరో వైపు ఇప్పటికే బడిలో నమోదై చాలా కాలం నుంచి బడికి రాకుండా ఉన్న డ్రాప్ అవుట్ పిల్లలను గుర్తించే పనిలో అధికారులు ఉన్నారు. వీటి ఫలితాలను త్వరలో వెల్లడిస్తారని సమాచారం. సర్వేలో విద్యార్థి పేరు, ఆధార్ సంఖ్య, పుట్టిన తేది, వయస్సు, కుటుంబ సభ్యుల జీవనాధారం ఇతర అంశాలను సైతం నమోదు చేసినట్లు తెలుస్తుంది.



నల్లగొండ మండలం అన్నపురెడ్డిగూడెంలో సర్వే చేస్తున్న సీఆర్‌పీ (ఫైల్)

**ప్రస్తుత సర్వేలో బడి బయటి పిల్లలు**

| జిల్లా | ఇటుక బట్టీల వద్ద గుర్తించిన పిల్లలు | 6-14 సంవత్సరాలు | 15-19సంవత్సరాలు | మొత్తం |
|---|---|---|---|---|
| నల్లగొండ | 244 | 225 | 186 | 685 |
| సూర్యాపేట | -- | 144 | 67 | 211 |
| యాదాద్రి | 225 | 68 | 25 | 318 |
| మొత్తం | 499 | 437 | 278 | 1,214 |

**గుర్తించిన పిల్లలను బడిలో చేర్పించేలా చర్యలు**

బడిబయటి పిల్లల గుర్తింపును రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాలతో చేపట్టాం. నల్లగొండ జిల్లాలో 655 మంది పిల్లలు ఉన్నట్లు తేలింది. ఇందులో వివిధ రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కార్మికుల పిల్లలే ఎక్కువగాఉన్నారు. ఇక్కడ పనులు ముగియగానే తల్లిదండ్రులతో కలిసి వారి స్వస్థలాలకు వెళ్లే అవకాశం ఉన్నది. ఇప్పటికే చాలా మందిని స్థానికంగా ఉన్న బడుల్లో చేర్పించేలా చర్యలు తీసుకున్నాం.

– బి.భిక్షపతి, డీఈఓ, నల్లగొండ

**గతేడాది సర్వేలో ఇలా..**

2023-24 సంవత్సరంలో చేపట్టిన సర్వేలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,249 మంది బడి బయటి పిల్లలను గుర్తించారు. ఇందులో నల్లగొండ జిల్లాలో 438, సూర్యాపేటలో 179, యాదాద్రి భువనగిరిలో 632 ఉన్నారు. వారిలో ఎక్కువగా 1,007మంది పిల్లలు ఇటుక బట్టీల వద్ద ఉన్నట్లు గుర్తించారు.

**ప్రస్తుత సర్వేలో 1,214 మంది..**

ప్రస్తుతం 2024-25లో చేపట్టిన సర్వేలో ఉమ్మడి జిల్లాలో 1,214 మంది బడి బయటి పిల్లలను గుర్తించారు. ఇందులో ఎక్కువగా ఇటుక బట్టీల వద్ద ఉన్నట్లు నమోదు చేశారు. వీరంతా ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కూలీలకు చెందిన పిల్లలే. వీరిని సమీపంలోని పాఠశాలల్లో చేర్పించే ప్రయత్నంలో విద్యాశాఖ నిమగ్నమైంది.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో సత్తా చాటిన నల్లగొండ జిల్లా జట్లు

- బాలికల జట్టు ప్రథమ, బాలుర టీమ్ ద్వితీయ బహుమతి కైవసం



రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ఫస్ట్ ప్రైజ్ సాధించిన నల్లగొండ జిల్లా బాలికల జట్టు

హాలియా, జనవరి 16 : సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో ఈ నెల 11 నుంచి 14 వరకు జరిగిన రాష్ట్రస్థాయి 49వ జూనియర్ కబడ్డీ పోటీల్లో నల్లగొండ జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. బాలికల జట్టు మొదటి బహుమతి సాధించగా, బాలుర జట్టు ద్వితీయ బహుమతి గెలుచుకున్నది. ఈ బహుమతులను కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్‌యాదవ్ చేతుల మీదుగా అందుకున్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించిన బాల, బాలికల జట్టు సభ్యులను కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భూలోకరావు, కర్తయ్య అభినందించారు. వారి వెంట కోచ్‌లు, మేనేజర్లు కృష్ణారెడ్డి, సత్యనారాయణ, అన్వర్, పరమేశ్, యడవల్లి రాంబాబు ఉన్నారు.

## ట్రాఫిక్ నియంత్రణకు ట్రయల్ రన్

- చౌటుప్పల్‌లో ముందస్తు చర్యలు చేపట్టిన పోలీసులు

చౌటుప్పల్, జనవరి 16 : సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్లిన ప్రజలు రేపటి నుంచి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కానున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ - విజయవాడ హైవేపై ట్రాఫిక్ జామ్ కాకుండా పోలీసులు ముందుస్తు చర్యలు చేపట్టారు. పండుగ ముందు రెండు రోజులు 65వ జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిన విషయం తెలిసిందే. తిరుగు ప్రయాణంలో అలాంటి ఇబ్బందులు కలుగకుండా చౌటుప్పల్ పట్టణంలో బస్టాండ్, తంగడపల్లి, వలిగొండ తదితర మార్గాలను మూసివేసేందుకు ట్రయల్స్ వేస్తున్నారు. ట్రాఫిక్ ఎక్కువైతే వీటిని మూసివేసి మండలంలోని లక్కారం అండర్ పాస్ బ్రిడ్జి, ధర్మోజిగూడెం, అంకిరెడ్డిగూడెం స్టేజీల వద్ద వాహనాలు యూటర్న్ తీసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఒకవేళ ట్రాఫిక్ తక్కువగా ఉంటే యథావిధిగా మార్గాలను తెరువనున్నారు. దాంతో స్థానిక వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు తప్పవు. అయినా.. ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారించిన పోలీసులు ఆ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. దాదావు 70మంది పోలీసులు విధులు నిర్వర్తించనున్నారు. బుధవారం నుంచి విద్యాలయాలు, ఆఫీసులు ఉండటం.. తర్వాత రోజు అన్ని పాఠశాలలు తెరవనుండడంతో ఏపీకి వెళ్లినవారు ఒక్కసారిగా హైదరాబాద్‌కు వెళ్లనున్నారు. దాంతో ఒక్కసారిగా వాహనాల రద్దీ పెరుగనుంది. అయితే.. ట్రాఫిక్ ఇబ్బందుల దృష్ట్యా పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద మొత్తం 16 టోల్ బూత్‌లకు గాను హైదరాబాద్ వైపు పదింటిని తెరిచారు.



చౌటుప్పల్ బస్టాండ్ మార్గాన్ని మూసివేసేందుకు ట్రయల్ వేస్తున్న పోలీసులు

## నర్రా వేణుగోపాల్‌రెడ్డికి ఎంఎఫ్ హుస్సేన్ పురస్కారం

నార్కట్‌పల్లి, జనవరి 16 : నార్కట్‌పల్లికి చెందిన లఘు చిత్ర దర్శకుడు, యువ చిత్రకారుడు, చిత్రలేఖనోపాధ్యాయుడు నర్రా వేణుగోపాల్‌రెడ్డి ప్రతిష్టాత్మక ఎంఎఫ్ హుస్సేన్ పురస్కారానికి ఎంపికయ్యారు. మహారాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ ఆర్ట్ కాంటెస్ట్ 2024లో విశేష ప్రతిభ కనబర్చినందుకుగాను ఈ అవార్డుకు ఎంపికైనట్లు కార్యక్రమ నిర్వాహకులు మంగళవారం తెలిపారు. చిన్ననాటి నుంచే ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, దాని అనుబంధ రంగాల్లో కృషి చేస్తూ సాగుతున్న నర్రాకు ఈ అవార్డు రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య, ప్రపంచ ఐక్య ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి ఎంవీ గోనారెడ్డి, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి కార్యదర్శి డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, ప్రముఖ చిత్రకారుడు కూరెళ్ల శ్రీనివాస్, తేజ విద్యాలయ వ్యవస్థాపకుడు వి.సోమిరెడ్డి, జనభారతి సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు అభినందనలు తెలిపారు.

